క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కురవి : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సిద్ధార్థ హైస్కూల్ కరస్పాండెంట్ ఎ.కార్తీక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు 9885214380 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాలధారులకు ముస్లిం అన్నదానం



మరిపెడ రూరల్: అయ్యప్ప దీక్షను చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి ముస్లిం మాజీ సర్పంచ్ దంపతులు మత సామరస్యాన్ని చాటుకున్నారు. మండలంలోని చిల్లంచర్లకు చెందిన మాజీ సర్పంచ్ షేక్ నూర్జహాన్ సత్తార్ దంపతులు అదే గ్రామంలోని సుమారు 100 మంది అయ్యప్ప స్వాములకు ఇంటి వద్ద శనివారం అన్నదానం చేశారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో స్వాములకు అన్నదానం చేసినట్లు వారు తెలిపారు.

పట్టణ ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్

నెహ్రూసెంటర్ : లంబాడీ హక్కుల పోరాట సమితి మహబూబాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా బానోత్ పవన్‌కుమార్‌నాయక్‌ను నియమిస్తున్నట్లు సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బోడ లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు ఆంగోత్ చందులాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నియామకపత్రాన్ని అందజేశారు.

రబీ సాగులో అప్రమత్తంగా ఉండాలి



తొర్రూరు రూరల్: రబీ సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని నాంచారిమడూరు శివారులో వేస్తున్న వరినాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరి నాట్లు వేసే ముందు దుక్కికి సాగునీరు అందించి రెండు, మూడుసార్లు దున్ని పదిరోజులపాటు మురగబెట్టిన తర్వాత నాట్లు వేసుకోవాలన్నారు. ఏఈఓ వినయ్, రైతులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

దంతాలపల్లి : పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి బాద చైతన్య అన్నారు. మండలంలోని ఆగపేట పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా వివిధ రకాల వ్యాధులు సోకి అకాల మృతి చెందుతున్నారన్నారు. పిల్లలు ఏ మాత్రం నలతగా కనిపించినా స్థానిక ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పిల్లల రాజు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



డోర్నకల్: హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మండలోజు సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎల్.నిఖిత 45 కేజీల విభాగంలో మూడో స్థానం, 49 కేజీల విభాగంలో బి.మమత రెండో స్థానం, 55 కేజీల విభాగంలో బి. సౌజన్య మొదటి స్థానం, 59 కేజీల విభాగంలో డి.అఖిల రెండో స్థానంలో నిలిచి ప్రతిభ కనబర్చారని తెలిపారు. నలుగురు క్రీడాకారులు బయ్యారం ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థులని తెలిపారు.

కార్మిక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

మహబూబాబాద్ : కార్మిక శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కె.రవి, బి.సూర్యం డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేశారు. వినతిపత్రం అందించిన వారిలో శ్రీను, కాంతారావు, రాము, యాకయ్య, సాంబయ్య, తదితరులు ఉన్నారు.

మరమ్మతులకు మోక్షం కలిగేనా..?

- అధ్వానంగా కాల్వలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం, జయపురం, ముంగిమడుగు చెరువుల్లోకి కొమ్ములవంచ ఆయకట్టు నుంచి నీళ్లు వెళ్లడానికి తీసిన కాల్వలు చెట్లు, ముళ్ల కంపతో నిండి అధ్వానంగా తయారయ్యాయి. గత నాలుగేళ్లుగా కాల్వలు శుభ్రంగా లేక, మరమ్మతుకు నోచుకోక అధ్వానంగా ఉండటంతో చెరువుల్లోకి నీళ్లు పోవడం లేదు. జయపురంలో దేవునిచెరువు. రెండు కుంటలకు, రామన్నగూడెంలో పెద్దచెరువు, వెంకమ్మ చెరువు, ముంగిమడుగులోని చెరువులకు కాల్వలు శుభ్రంగా లేక నీళ్లు రావడం లేదు. జయపురంలో 200 ఎకరాలు, రామన్నగూడెంలో 250 ఎకరాలు, ముంగిమడుగులో 150 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా చెరువులకు నీళ్లు వచ్చే కాల్వల మరమ్మతు కోసం ఏ నాయకుడు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల్లో ప్రజలు విమర్శిస్తున్నారు. గత ఖరీఫ్‌లో వచ్చిన భారీ వర్షాలకు రామన్నగూడెంలోని పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో నీళ్లు వెళ్లిపోగా పంటసాగు నిలిచిపోయింది. వెంటనే అధికారులు స్పందించి కొమ్ములవంచ ఆయకట్టు నుంచి వచ్చే కాల్వలను శుభ్రం చేసి నీళ్లు చెరువులకు, కుంటలకు వచ్చేలా చేయాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.



రామన్నగూడెం చెరువుకు వెళ్లే కాల్వలో ఏపుగా పెరిగిన చెట్లు

విలువలతో కూడిన విద్య అవసరం

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తొర్రూరు: మానవీయ విలువతో కూడిన విద్యను అందించినప్పుడే సమాజ శ్రేయస్సుకోరే పౌరులుగా విద్యార్థులు తయారవుతారని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం రాత్రి తొర్రూరులోని ఆర్యభట్ట హైస్కూల్‌లో 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వార్షికోత్సవంలో ముఖ్య అతిథులుగా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ పాల్గొని ప్రసంగించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల ఆందోళన చెందవద్దని సూచించారు. సినీ హీరోలను కాకుండా జాతీయ నాయకుల త్యాగాలను గురించి తెలుసుకోవడం అవసరమన్నారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండి పరీక్షలపైన దృష్టిని కేంద్రీకరిస్తే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చక్కని బోధన అందిస్తే విద్యార్థులు చదువుల్లో రాణించి ప్రయోజకులు అవుతారని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైద్యులు రాజేందర్ రెడ్డి, విద్యావేత్త లక్ష్మీనర్సింహరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

గుణాత్మక విద్య అందించాలి

మహబూబాబాద్ రూరల్ : గుణాత్మక విద్యను అందించడంలో ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులను సన్నద్ధులను చేయాలని మండలంలోని పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మందుల శ్రీరాములు అన్నారు. పర్వతగిరి జిల్లా పరిషత్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోగల దూదియతండా, కేవులతండా, వీఎస్.లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్ఎం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎఫ్.ఎల్.ఎన్ సమర్థవంతంగా నిర్వహించాలని, ఎఫ్ఏ వన్ పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్ లోనే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మౌనిక, సతీష్, సునీతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’లో భారీ అవినీతి

- పనులు చేయకుండానే నిధుల స్వాహా

నర్సింహులపేట : మండలంలోని 22 గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో భారీ అవినీతి జరిగింది. పనులు చేయకుండానే రికార్డులు చేసి డబ్బులు స్వాహా, రోడ్డు పనులు చేయకుండానే నిధులు గల్లంతు, ఎంపీడీఓ, ఏపీఓ సంతకాలు లేకుండానే మస్టర్లు కొట్టి బిల్లులు చేయడం, గ్రామాల్లో లేని వాళ్ల పేర్లతో కూలీల డబ్బులు స్వాహాతో పలు గ్రామాల్లో భారీగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. మండలంలో ఏప్రిల్ 1, 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై తనిఖీ చేశారు. మండలంలో జరిగిన 377 పనులకు గాను రూ. 8,58,00,508 నిధులతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్, టీఏ, ఈసీ, ఏపీఓ, ఎంపీడీఓ, మేట్, పంచాయతీ కార్యదర్శుల పేర్లతో 22 గ్రామాల్లో రూ.7,24,055 అవినీతి జరిగిందని డ్వామా అధికారులు వెల్లడించారు. కొన్ని పనులకు రికార్డులు ఇవ్వలేదని తనిఖీ బృందం వెల్లడించింది. అవినీతి జరిగినా, పనులు చేయకున్నా నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ మధుసూదన్‌రాజు, ఏపీడీ వీరబాబు, అంబుడ్స్‌మెన్ అదాం, ఎస్ఆర్‌పీలు కొమురయ్య, కుమార్, ఎంపీఓ యాకయ్య, ఎంపీడీఓ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న పీడీ మధుసూదన్‌రాజు

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, జిల్లా కార్యదర్శి బి.అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. జీపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో మోహినొద్దీన్, ఎల్లయ్య, ఉపేంద్రాచారి, నాగేశ్వర్‌రావు, లతీఫ్, అశోక్, దస్తగిరి, దాసు, కనుకలక్ష్మి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ ఉద్యోగులు, నాయకులు

సంక్షిప్త సమాచారం

వీరన్న సన్నిధిలో లయన్స్ గవర్నర్ పూజలు

కురవి: స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ వెంకటరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయన కుటుంబసభ్యుల పేర్లపై గోత్రనామార్చనలు చేశారు. దుశ్శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

ఇళ్లను పూర్తి చేసి పేదలకు పంచాలి



నెహ్రూసెంటర్ : పెండింగ్‌లో ఉన్న 150 డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి పేదలకు పంచి ఇవ్వాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా వదిలేసిన డబుల్‌బెడ్రూం ఇళ్లను శనివారం పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సగంలోనే నిర్మాణాలను వదిలేశారని విమర్శించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సీతారాం నాయక్, రాజమౌళి, రాజు, వీరేష్, పాల్గొన్నారు.

డోర్నకల్‌లో బుద్దిస్ట్ సొసైటీ సమావేశం

డోర్నకల్ : స్థానిక సుభాష్‌వీధిలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్యరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నూకల అభినవ్‌రెడ్డి పాల్గొని బుద్దుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇదే ప్రాంగణంలో నూకల నరేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రాము,

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

గార్ల: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ హైస్కూల్లో గెజిటెడ్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న రాములుపై మతోన్మాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి బాలాజీనాయక్ తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పాదయాత్ర



మహబూబాబాద్ రూరల్ : సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని అనంతాద్రి శ్రీజగన్నాథ వెంకటేశ్వరస్వామి ఆయానికి శనివారం పాదయాత్ర నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని పాదాల వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతిపత్రాన్ని అందించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి 300 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాదయాత్ర నిర్వహించగా సంఘం జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న మాట్లాడారు. తమ డిమాండ్ల సాధన కోరుతూ జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట 23 రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మనసు కరిగించి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేసే విధంగా చూడాలని కోరారు.

సునీతకు అభినందనలు

గార్ల: మండలంలోని గుంపెళ్లగూడేనికి చెందిన తాటిపాముల సునీత జిల్లా కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియామకంపై మండల కేంద్రంలో శనివారం మండల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఆమెను అభినందించారు.

ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని వీఎస్.లక్ష్మీపురంలోని ఆంజనేయస్వామి దేవాలయ నూతన అభివృద్ధి కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన అన్ని కుల సంఘాల పెద్ద మనుషుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మార్నేని వెంకన్న, ఉపాధ్యక్షుడిగా సురుగు ఐలయ్యతో పాటు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ధర్మన్న వర్ధంతిని జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని కొండపల్లి గోపాల్‌రావుకాలనీలో నేడు (ఆదివారం) జరిగే సీపీఐ నేత, అమరజీవి ధర్మన్న 24వ వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ శనివారం తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై వర్ధంతిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

వరిపంటలో ఏఓ క్షేత్ర ప్రదర్శన

గార్ల: వరిపంటలో కాంప్లెక్స్ ఎరువులు మోతాదుకు మించి వినియోగించడం వలన పంటలకు చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గుతాయని ఏఓ కావటి రామారావు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సత్యనారాయణపురంలో ఆయన వరినాటులో క్షేత్ర ప్రదర్శన చేశారు. పంట భూముల్లో భాస్వరం ఎరువులు కరుగలేని స్థితిలో ఉన్నాయని, వాటిని కరిగించి మొక్కకు అందుబాటులోకి తీసకరావడం కోసం ఫాస్ఫా బాక్టీరియా మందు ఎకరాకు ఒక లీటరు ఆఖరి దుక్కిలో వేసుకోవాలని సూచించారు. పలు రకాల సూచనలు ఇచ్చారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



దంతాలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు, కమిటీ సభ్యులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. శనివారం పెద్దముప్పారంలో చేపడుతున్న సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు.

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని దర్గాతండాలో శనివారం అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. సర్వే పర్యవేక్షకులుగా ఏపీఎం తిలక్ హాజరై సిబ్బంది చేస్తున్న ఇళ్ల సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు.

ఓసీ క్లబ్ అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్ నిజాం అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీకి అప్పగించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్‌తో పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందచేశారు. తొర్రూర్ బస్టాండ్ సెంటర్‌లో కూడా కోఆపరేటివ్ బ్యాంక్ స్థలంగా ప్రచారం జరుగుతున్నది కానీ మున్సిపాలిటీ స్థలం అని దానిని కూడా మున్సిపాలిటీకి అప్పగిస్తే క్లాంపెక్స్ నిర్మాణం చేయడం జరుగుతుందని ఆ విలువైన భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా ఉంటుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

నెల్లికుదురు : కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ వేడుకలను శనివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు, నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

గార్ల: ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌కె రియాజ్ పాషాను శనివారం సేవాలాల్ సేనా సంఘం నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి



మహబూబాబాద్ రూరల్/కురవి/ బయ్యారం /తొర్రూరు/ : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని, రెమ్యునేషన్‌తో పాటు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మహబూబాబాద్, కురవి, బయ్యారం, తొర్రూరు ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అదే విధంగా ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయటం కోసం ఉపాధ్యాయుల జాబితాను మండల విద్యాధికారికి సమర్పించాలని కోరారు.

వలలో చిక్కిన కొండ చిలువ

దంతాలపల్లి : మండలంలోని దాట్ల గ్రామ పెద్ద చెరువులో 12 అడుగుల కొండ చిలువ వలలో చిక్కింది. చెరువు నుంచి చేపలు బయటకు పోకుండా మత్స్య కారులు అలుగు సమీపంలో వలను కట్టారు. చేపల కోసం వచ్చిన కొండ చిలువ వలలో చిక్కింది. అటుగా వచ్చిన చెరువు కాపలాదారుడు వల దగ్గరకి రావడం గమనించి పరిశీలించగా సుమారు 12 అడుగుల కొండ చిలువ వలలో చిక్కుకోవడం గమనించాడు. భయంతో ఆ కొండ చిలువను చంపారు. సుమారు రెండు కిలోల చేపను మిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

మరిపెడ రూరల్: అమరజీవి పిట్టల దుర్గయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పురుషోత్తమాయగూడెంలో దుర్గయ్య 14వ వర్ధంతి సభ మండల కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా దుర్గయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ మండలంలోని రైతాంగానికి సాగు జలాల కోసం డీపీఎం 60 ఎస్సారెస్పీ కాల్వ కోసం రైతులతో కలిసి పోరాటాలు కొనసాగించాడన్నారు.

వైభవంగా చండీయాగం

మహబూబాబాద్ రూరల్ : భక్తులందరికీ శుభం చేకూరాలని కోరుతూ పట్టణంలోని బ్యాంకు కాలనీ ప్రాంత నిర్వాసితులు పల్లపోతుల లక్ష్మీనారాయణ, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శనివారం చండీయాగం పూజలను వైభవంగా నిర్వహించారు.

క్రైం కార్నర్

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

డోర్నకల్: రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై జి.ఉమ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డకు చెందిన గద్దల వెంకటయ్య, సుగుణమ్మ దంపతులతో పాటు మనవడు ఉజ్వల్‌చంద్ర ఈ నెల 25న కొత్తతండాకు చెందిన ఆంగోత్ లక్పతికి చెందిన ఆటోలో వెళ్తున్నారు. సీరోలు మండలం అందనాలపాడుకు వెళ్తున్న క్రమంలో రావిగూడెం సమీపంలో ఆటో చనిపోయి పడి ఉన్న గేదెను ఢీకొట్టడంతో వెంకటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందంటూ వెంకటయ్య కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ లక్పతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల చోరీపై..

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులో ఓ చికెన్ సెంటర్‌లో కోళ్ల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. ఉమ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బైపాస్ రోడ్డులోని భవాని చికెన్ సెంటర్‌లోని ఇనుప జాలీలో పది కోళ్లను ఈ నెల 26న గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు షాపు యజమాని మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం పట్టివేత

గార్ల : ఏపీ నుంచి అక్రమంగా బెల్లం, పటికను తీసుకొస్తున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ మండలం సీత్లా తండాకు చెందిన భూక్య వీరన్న, బానోత్ లింగమూర్తి రైలులో 2.40 క్వింటాల బెల్లం, 5 కేజీల పటికను తరలిస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బెల్లం, పటికతో వేచి ఉన్న ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా తెలిపారు. బెల్లం, పటిక విలువ రూ.9,650 ఉండగా ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఆర్టీసీ బస్సు డిపో పరిధిలోని ఓ బస్సులో ఐదు లీటర్ల డీజిల్ చోరీ జరుగగా డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై కే.శివ శనివారం తెలిపారు. బస్సు డిపోలో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై శ్రామిక్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాగం ప్రవీణ్ ఓ బస్సులోని ఐదు లీటర్ల డీజిల్‌ను ఓ క్యానులో పోసి శనివారం తెల్ల వారుజామున మూడు గంటల సమయంలో డిపో గోడమీది నుంచి బయటకు పడవేశాడన్నారు. ఆ సమయంలో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బిక్కు ఆ సంఘటనను గమనించి డీఎం శివప్రసాద్కు సమాచారం ఇవ్వగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

పాఠశాలలో విద్యుత్ మీటర్ ధ్వంసం

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు శుక్రవారం రాత్రి పాఠశాలలో కొన్ని వస్తువులను ధ్వంసం చేశారు. క్రిస్మస్ సెలవులు రావడంతో పాఠశాల బంద్ కావడంతో కొందరు తాగడానికి వచ్చిన ఆకతాయిలు పాఠశాలలో ఉన్న విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేయడంతోపాటు తరగతి గదులకు ఉన్న తాళాలు పగులగొట్టారు. ఈ విషయంపై పాఠశాల బాధ్యులు పోలీసులను ఆశ్రయిస్తే ఆకతాయిల అగడాలకు చెక్ పెట్టవచ్చు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యక్తి మృతి

తొర్రూరు: బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని 1వ వార్డుకు చెందిన రాంపల్లి రవి(39) ప్రాథమిక వైద్యుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రవికి బ్రెయిన్ స్ట్రోక్ రాగా వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య రజిత, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె సహస్రలు ఉన్నారు. రవి మృతి పట్ల పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

మరిపెడ రూరల్ : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాంపొంగు యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం మండలంలోని గుండెపుడి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యశ్వంత్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా నష్టపోతున్న మాదిగలకు, మాదిగ ఉపకులాలకు ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలన్నారు. బాబు, బిక్షం, బాలరాజు, కొమురమల్లు, గౌతమ్, రవీందర్, నాగేష్,శ్రీను పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు మరువలేనివి

బయ్యారం : దేశప్రధానిగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలకేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

గార్ల : దేశంలో అతికొద్ది మంది మేధావుల్లో ఒకరైన గొప్ప నాయకుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణగౌడ్ అన్నారు.

కేసముద్రం: విలేజ్‌లోని శ్రీవివేకవర్ధినీ హైస్కూల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్‌తోపాటు,



బయ్యారం : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్ రూరల్ : 26వ వార్డు సిగ్నల్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు.

క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని విలువైన ప్రభుత్వ క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజల బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓసీక్లబ్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 కోట్ల విలువ చేసే రెండెకరాల భూమిని స్వాధీనం చేసుకునేలా జిల్లా అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. అన్ని రకాల ఆధారాలతో ప్రభుత్వ భూమి తేల్చి ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ, రవి, శ్రావణ్, ఎండి.ఫాతిమా, రమేష్, వీరన్న, మహమూద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

డ్వాక్రా గ్రూపు డబ్బులు స్వాహా..!

- వీఓఏతో వాగ్వాదానికి దిగిన సభ్యులు
- సొంతానికి వాడుకున్నట్లు అంగీకరించిన వీఓఏ

కేసముద్రం: డ్వాక్రా గ్రూపు సభ్యులు తీసుకున్న రుణం కింద బ్యాంకులో నెలనెలా చెల్లించాల్సిన కిస్తీ డబ్బులను సదరు వీఓఏ(సీఏ) బ్యాంకులో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్న సంఘటన మండలంలోని కోరుకొండపల్లిలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఐకేపీ సీసీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన స్నేహ ఐపీఎస్ మహిళా సంఘంలో 10 మంది సభ్యులు ఉన్నారు. ఆ గ్రూపు సభ్యులు ఓ బ్యాంకులో 2023 జనవరిలో తీసుకున్న రూ.10 లక్షల రుణం కింద నెలనెలా కిస్తీగా బ్యాంకులో డబ్బులను చెల్లించాల్సి ఉంది. అయితే ఆ గ్రూపు సభ్యులు 14 నెలల పాటు మొత్తం రూ.5,00,400లను వీఓఏ మైబూబకు బ్యాంకులో చెల్లించమని ఇచ్చారు. ఈ క్రమంలో ఇటీవల బ్యాంకుకు వెళ్లిన ఆ గ్రూపు సభ్యులు తమ లోను విషయంపై బ్యాంకు అధికారులను ఆరా తీశారు. మీరు సక్రమంగా కిస్తీ చెల్లించడంలేదని అధికారులు చెప్పడంతో ఆ గ్రూపు సభ్యులు ఒక్కసారిగా విస్తుపోయారు. దీంతో ఆగ్రహించిన ఆ గ్రూపు సభ్యులు శనివారం ఆ గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి డబ్బుల విషయంపై వీవోఏ మైబూబను నిలదీశారు. విషయం తెలుసుకున్న ఐకేపీ సీసీ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని సంబంధిత రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టాడు. కొందరు గ్రూపు సభ్యులు వీఓఏకు డబ్బులు ఇచ్చినట్లుగా నిర్ధారించారు. కాగా మరో ఇద్దరు సభ్యులు తనకు డబ్బులు ఇవ్వలేదంటూ వీఓఏ తెలుపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ ఇద్దరు ప్రమాణం చేసి వీఓఏకు డబ్బులు ఇచ్చామని చెప్పారు. చివరకు అట్టి డబ్బులను తాను చెల్లిస్తానని వీఓఏ అంగీకరించింది. వాడుకున్న డబ్బులను 2025 ఫిబ్రవరి 5న చెల్లించాలని గ్రామస్తుల సమక్షంలో తీర్మానించినట్లు సీసీ తెలిపారు.